పాత మెనూ ప్రకారమే భోజనం

జిల్లాలో సంక్షేమ వసతి గృహాల వివరాలు..			
వసతి గృహాలు	హాస్టళ్ల సంఖ్య	విద్యార్థులు	వార్డెన్లు
ఎస్సీ సంక్షేమ శాఖ	30	2,500	15
బీసీ సంక్షేమ శాఖ	26	2,600	16
ఎస్టీ సంక్షేమ శాఖ	11	2,600	09


కొత్త ఆహార పట్టిక

- వసతి గృహాల్లో పెరిగిన డైట్‌చార్జీలు
- అయినా కొత్త మెనూను పట్టించుకోని అధికారులు

బాన్సువాడ : సంక్షేమ వసతి గృహాలు, గురుకులాల్లో పాఠశాలల విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు డైట్‌చార్జీలు పెంచినా కొత్త ఆహార పట్టిక(మెనూ) అమలులో తాత్సారం జరుగుతోంది. మెనూ అమలులో ఒక్కో చోట ఒక్కో తీరుగా వ్యవహరిస్తుండటంతో నాణ్యమైన ఆహారం అందకుండా పోతోంది. గత ఏడాది నవంబర్ 1 నుంచి మెనూ అమలులోకి వచ్చినా పౌష్టికాహారం ఉండే భోజన మెనూ తయారీపై నిర్లక్ష్యం వీడటం లేదు. ఎస్సీ, బీసీ వసతి గృహాల్లో మెనూ పట్టిక తయారు చేయలేదంటే పరిస్థితి ఏ విధంగా ఉందో తెలుస్తోంది. మౌఖికంగా ఆహార పట్టికపై ఆదేశాలు ఇచ్చినా క్షేత్ర స్థాయిలో ఇంకా పాత మెనూతోనే సరిపెడుతున్నారు. వసతి గృహాలు, గురుకులాల్లో 3 నుంచి 7వ తరగతి విద్యార్థులకు రూ.950 నుంచి రూ.1,330, 8వ తరగతి నుంచి 10వ తరగతి వరకు రూ.1,100 నుంచి రూ.1,540, ఇంటర్, డిగ్రీ కళాశాల విద్యార్థులకు రూ.1,500 నుంచి రూ. 2,100 వరకు పెరిగాయి. ఈ లెక్కన దాదాపు రూ.400 నుంచి రూ. 600 వరకు పెరిగాయి. అయినా కొన్నిచోట్ల పాత మెనూనే అమలు చేస్తున్నారు.

జిల్లాలో ఇలా..

జిల్లాలో 30 ఎస్సీ వసతి గృహాల్లో సుమారు 2,500 మంది విద్యార్థులు ఉంటున్నారు. గతంలో రోజు విడిచి రోజు కోడి గుడ్లు, అరటి పండ్లు, ఒక్క రోజు చికెన్ పెట్టారు. ప్రస్తుతం మారిన మెనూ ప్రకారం ఐదు కోడి గుడ్లు, ఆరు రోజులు అరటిపండ్లు, రెండు రోజులు చికెన్, ప్రైమరీలో ఆరు అరటిపండ్లు, ఆరు కోడిగుడ్లు, ఒక్క రోజు చికెన్ అందించాలి. జిల్లాలో ఉన్న 26 బీసీ వసతి గృహాల్లో ఇది వరకు మూడు రోజులు కోడిగుడ్లు, మూడు రోజులు అరటి పండ్లు, రోజు విడిచి రోజు పిల్లలకు అందించగా కొత్త మెనూలో ఒక కోడిగుడ్డు, అరటిపండుతో పాటు కొత్తగా గుడ్‌డే బిస్కెట్ మాత్రం ఒకటి చేర్చారు. వసతి గృహాలకు ఎవరైనా సందర్శనకు వస్తే ఉదయం వండాల్సింది సాయంత్రం పెడతామంటూ సర్ది చెప్పడం పరిపాటిగా మారింది. బాన్సువాడ ఎస్సీ వసతి గృహాన్ని పరిశీలించేందుకు సాక్షి విలేకరి వెళ్లగా వసతి గృహంలో 50 మంది విద్యార్థులకు సరిగ్గా కిలో పప్పు, కిలో పుంటికూర అటు ఇటుగా పాత్రలో వేసి ఉడికిస్తున్నారు. విద్యార్థులకు ఆ భోజనం ఎలా సరిపోతుందో అధికారులకే తెలియాలి. రూ.600 డైట్‌చార్జీలు అదనంగా పెరిగినా ఒక కోడి గుడ్డు, అరటి పండు పెంచకుండా ఒక రోజు చికెన్, బిస్కెట్‌ను కొత్త మెనూలో చేర్చడం గమనర్హం. భోజనం కూడా అరకొరగానే వడ్డించడం చూస్తే పర్యవేక్షణ ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

ఇన్‌చార్జి వార్డెన్లతో..

బీసీ వసతి గృహాల వార్డెన్లకు ఒక్కొక్కరికి రెండు నుంచి మూడేసి హాస్టళ్ల ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. పక్క పక్క మండలాలకు చెందిన వారికి కాకుండా దూరంగా ఉండే వారికి అప్పగించడ వల్ల పర్యవేక్షణ ఎలా ఉంటుందో తెలియకుండా పోతోంది. నిరంతరం పర్యవేక్షణ అంతంత మాత్రంగా ఉంటుండగా అదనపు బాధ్యతల వల్ల ఏదో ఒక చోట ఉన్నామంటూ తప్పించుకుంటున్నారు. బాన్సువాడ ఎస్సీ వసతి గృహం వార్డెన్ లక్ష్మణ్‌కు అదనంగా బోర్లం వసతి గృహం ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. బాన్సువాడ బీసీ వసతి గృహం వార్డెన్ శ్యాంకుమార్‌కు అదనంగా బీర్కూర్ బీసీ వసతి గృహం బాధ్యతలు అప్పగించారు. అలా ఇన్‌చార్జి ఇవ్వడంతో అక్కడ ఉన్నానంటే ఇక్కడ ఉన్నా అనే సమాధానంతోనే కాలం గడుపుతున్నారు. మెనూ అమలుపై అధికారుల పర్యవేక్షణ అంతంతమాత్రంగా ఉంది. ఏదైనా ఘటన జరిగినప్పుడు హడావుడి చేసే అధికారులు తర్వాత పట్టించుకోవడం లేదనే ఆరోపణలు మాత్రం ఉన్నాయి.


బాన్సువాడ ఎస్సీ వసతి గృహంలో 50 మంది విద్యార్థులకు వండుతున్న కిలో పుంటికూర పప్పు


యాభై మంది విద్యార్థులకు వండటానికి సిద్ధం చేసిన ఐదు కిలోల బియ్యం

తనిఖీ చేసి చర్యలు తీసుకుంటాం

ఒక్కో విద్యార్థికి 200 గ్రాముల వరకు అన్నం పెట్టాలి. 50 మంది విద్యార్థులున్న వసతి గృహంలో కనీసం 10 కిలోల బియ్యం వండాల్సి ఉంటుంది. వసతి గృహాల్లో కొత్త మెనూ ప్రకారం భోజనం పెట్టాలి. అమలు కానీ వసతి గృహాలను తనిఖీ చేసి చర్యలు తీసుకుంటాం. –రజిత, డీఎస్సీడీవో, కామారెడ్డి

క్లుప్తంగా

మోడల్‌స్కూల్‌లో అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోవాలి



ఎల్లారెడ్డి రూరల్: మోడల్‌స్కూల్‌లో అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ గాంధీ తెలిపారు. మంగళవారం లింగారెడ్డిపేట, కళ్యాణి, తిమ్మారెడ్డి, వెల్లుట్ల, అన్నాసాగర్ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ఐదో తరగతి విద్యార్థులకు కరపత్రాలను అందజేశారు. మోడల్ స్కూల్‌లో ఆరవ తరగతిలో అడ్మిషన్ల కోసం ఈ నెల 28లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు జహంగీర్, రాజశేఖర్, బలవంతరావు, ప్రియదర్శిని, విద్యారమణ, లక్ష్మణ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంపాక్ట్ సర్టిఫికెట్ ప్రదానం



బీబీపేట: ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ 189వ బ్యాచ్ శిక్షణ కార్యక్రమం హైదరాబాదులోని గ్రాండ్ స్టార్ హోటల్లో రెండు రోజుల పాటు నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమానికి కోనాపూర్ గ్రామానికి చెందిన అడ్వకేట్ చెప్యాల నాగభూషణం హాజరై పబ్లిక్ స్పీకింగ్ స్కిల్స్, పర్సనల్ డెవలప్మెంట్ స్కిల్స్‌పై శిక్షణ ఇచ్చారు. మంచి శిక్షణ ఇచ్చినందుకు ఆయనకు ఇంపాక్ట్ ట్రైనర్ సర్టిఫికెట్‌ను గిన్నిస్ బుక్ అవార్డు గ్రహీత గంప నాగేశ్వరరావు, ప్రముఖ మెజీషియన్ చుక్కారావు వెంకటరమణల చేతుల మీదుగా అందుకున్నారు. నాగభూషణం అలియాస్ నాగేష్ తన గ్రామంలో 5 ఏదేళ్లపాటు సర్పంచ్‌గా పని చేశారు. ప్రస్తుతం కామారెడ్డి జిల్లా కోర్టు అడ్వొకేట్‌గా సేవలందిస్తున్నారు. శిక్షణ కార్యక్రమంలో రావూరిల సుధీర్, త్రినాథ్ దాసరి, ఇంచార్జ్ కేవీ సురేష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడి ఎన్నిక



బిచ్కుంద(జుక్కల్): బిచ్కుంద టౌన్ యూత్ అధ్యక్షుడిగా షెట్కార్ సాహిల్ రమేశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు దర్పల్ గంగాధర్ తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు, సాహిల్ రమేశ్‌ను సన్మానించి బాధ్యతలు అప్పగించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు మల్లికార్జునప్ప షెట్కార్, విఠల్‌రెడ్డి, జిల్లా యూత్ ఉపాధ్యక్షుడు యోగేష్, ఖలీల్, హఫీజ్ గౌస్, బొగడమీది సాయిలు, తుకారాం తదితరులున్నారు.

పంట కాలువలో పూడిక తొలగింపు



బాన్సువాడ: నస్రూల్లాబాద్ మండలం హాజీపూర్ శివారులో పంట కాలువలో పేరుకుపోయిన పూడికను రైతులు యంత్రం సాయంతో తొలగించారు. పంట కాలువలో పూడిక నిండిపోవడంతో పంట పొలాల్లోకి సాగునీరు అందడం లేదు. దీంతో రైతులు రూ.40 వేలు పోగు చేసి యంత్రం సహాయంతో పూడికను తొలగించారు. చెరువు కింద సుమారు 1000 ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి.

బీజేపీ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలి



సదాశివనగర్(ఎల్లారెడ్డి): బీజేపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలని నియోజకవర్గ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఇన్‌చార్జి హైమారెడ్డి సూచించారు. మంగళవారం మండల కేంద్రంలో బీజేపీ నాయకులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నియోజకవర్గ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఇన్‌చార్జి పూస రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్ రావు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు విఠల్‌రావు, అసెంబ్లీ కన్వీనర్ లింగారావు, మండలాధ్యక్షుడు రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న క్రషింగ్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): అడ్లూర్ ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ ముమ్మరంగా కొనసాగుతుంది. సోమవారం నాటికి 2 లక్షల 92 వేల 741 టన్నుల క్రషింగ్ జరిగినట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్ రావు తెలిపారు. పర్మిట్ల ఆధారంగా చెరుకును గానుగకు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు.

విద్యార్థులకు అభినందనలు


విద్యార్థినులతో ఉపాధ్యాయులు

పెద్దకొడప్‌గల్(జుక్కల్): కాటేపల్లి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఆదివారం నిర్వహించిన అంతర్జాతీయ కరాటే, కుంగ్‌ఫూ పోటీలలో పాల్గొని బంగారు, వెండి, కాంస్య పతకాలను సాధించారు. ఈ సందర్భంగా మంగళవారం విద్యాశాఖ మండల అధికారి ప్రవీణ్ కుమార్.. పోటీలలో ప్రతిభ చాటిన విద్యార్థినులను అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కరాటే కోచ్ శివప్రసాద్, ఉపాధ్యాయులు యాదవ్ శంకర్, లలిత, సునీత, సుజాత, బక్షిరామ్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



బిచ్కుంద(జుక్కల్): బండరెంజల్‌లో మంగళవారం సీసీ రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద రూ.5 లక్షలు మంజూరు అయ్యాయి. గ్రామంలోని ఆయా వార్డులలో అధికారులు సీసీ రోడ్లు వేస్తున్నారు. నాణ్యత లోపించకుండా నిబంధనల ప్రకారం సీసీరోడ్లు వేయాలని ప్రత్యేక అధికారి కాంట్రాక్టర్‌కు సూచించారు.

ప్రభుత్వాస్పత్రిలో అమ్మఒడి




భిక్కనూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిలో బుధవారం అమ్మ ఒడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు దివ్య..గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. అలాగే పౌష్టికాహారం తీసుకోవడం వల్ల కలిగే మేలు గురించి వివరించారు. అనంతరం మందులు అందజేశారు. ఎంపీహెచ్ఈవో వెంకటరమణ, స్టాఫ్‌నర్సులు హరిత, చైతన్య పాల్గొన్నారు.

లింగంపేట పీహెచ్‌సీలో..

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం అమ్మ ఒడి కార్యక్రమం నిర్వహించినట్లు వైద్యులు హిమబిందు తెలిపారు. ఈ సందర్భంగా గర్భిణులు తీసుకోవాల్సిన పౌష్టికాహారం, ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పలువురికి రక్త పరీక్షలు చేసి, రక్తహీనతతో బాధపడుతున్న వారికి ఐరన్ మాత్రలు పంపిణీ చేశారు.

ఉప్పర్‌పల్లిలో..



బీబీపేట: ఉప్పర్‌పల్లిలో మంగళవారం మల్లారెడ్డి నారాయణ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆపరేషన్లు అవసరమున్న 35 మందికి ఉచితంగానే ఆపరేషన్లు చేస్తామని వైద్యులు తెలిపారు. నాయకులు సుతారి రమేశ్, మల్లేశ్, డాక్టర్లు శ్రేయ, లావణ్య, వైద్య బృందం సునీత, రేవతి, వినేష్, ఓబుల్‌రెడ్డి పాల్గొన్నారు.

పంట వివరాల నమోదు




బీబీపేట: మాందాపూర్‌లో మంగళవారం వ్యవసాయ పంటల నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఏఈవో రాజేశ్ వ్యవసాయ పొలాల వద్దకు వెళ్లి పంటలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. అంతే కాకుండా రైతులకు వరికి వచ్చే తెగుళ్ల నివారణపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రస్తుతం వరి పొలంలో సోకుతున్న మొగి పురుగు పట్ల రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని, వరి పొలాన్ని ఆరబెడుతూ నీళ్లు పెట్టాలని రైతులకు తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత



రాజంపేట: రెండేళ్ల క్రితం సెల్‌ఫోన్ పోగొట్టుకున్న రాజంపేట గ్రామానికి చెందిన గుర్రాల రమేశ్ ఈ విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు సీఐఈఆర్ పోర్టల్ ద్వారా ట్రాక్ చేసి బాధితుడికి సెల్ ఫోన్‌ను మంగళవారం అప్పగించారు. ఫోన్ ట్రేసింగ్‌లో కృషి చేసిన కానిస్టేబుల్ రవీందర్, చిరంజీవి శైలజలను పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు.

ఇంటి పన్నుల వసూళ్లకు స్పెషల్‌డ్రైవ్



ఎల్లారెడ్డి రూరల్: ఎల్లారెడ్డి పట్టణంలో మున్సిపల్ సిబ్బంది స్పెషల్‌డ్రైవ్ చేపట్టి ఇంటి పన్నులు వసూలు చేశారు. మంగళవారం పలు వార్డుల్లో ఇంటింటికి తిరుగుతూ పన్నులను వసూలు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ మహేష్‌కుమార్ తెలిపారు. ప్రతి ఒక్కరూ ఇంటి పన్నులు చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలని కోరారు. మున్సిపల్ వార్డు ఆఫీసర్లు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు



బాన్సువాడ రూరల్: మండలంలోని తాడ్కోల్ చౌరస్తాలో మంగళవారం బాన్సువాడ సీఐ మండల అశోక్ ఆధ్వర్యంలో పోలీసులు ముమ్మరంగా వాహనాలను తనిఖీ చేశారు. పెండింగ్ చలాన్లను చెల్లించాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలను పాటించాలన్నారు. ద్విచక్రవాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు.

రక్తదాతలకు హెల్మెట్ల బహుమానం

– 15న మెగా రక్తదాన శిబిరం

కామారెడ్డి అర్బన్ : ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ పుట్టిన రోజు సందర్భంగా ఈనెల 15న శనివారం ఉదయం 9 గంటలకు కామారెడ్డి సిరిసిల్ల రోడ్డులోని క్లాసిక్ గోల్డెన్ ఫంక్షన్‌హాల్‌లో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు రక్తదాతల సమూహం వ్యవస్థాపకుడు బాలు,, అధ్యక్షుడు జమీల్ తెలిపారు. తలసేమియా వ్యాధితో బాధపడే చిన్నారుల కోసం నిర్వహిస్తున్న ఈ శిబిరంలో రక్తదానం చేస్తున్న ప్రతిదాతకు హెల్మెట్‌ను బహుమతిగా అందజేస్తారని పేర్కొన్నారు.

ఆరోగ్య వివరాలు నమోదు చేయాలి



ఎల్లారెడ్డి: ఆయుష్మాన్ భారత్ కార్డులలో ప్రజలు తమ ఆరోగ్య వివరాలను నమోదు చేయించుకోవాలని పల్లె దవాఖానా వైద్యులు శివకృష్ణ అన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు సంబంధించిన ఆరోగ్య వివరాలను ఆయుష్మాన్ భారత్‌కార్డులలో వైద్యులు నమోదు చేశారు. ఆయుష్మాన్ భారత్‌కార్డు ద్వారా భారతదేశంలో ఎక్కడైనా ఉచితంగా చికిత్స పొందవచ్చని ఆయన అన్నారు. దీనిని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అర్చకుడిపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



కామారెడ్డి టౌన్: చిలుకూరు బాలాజీ టెంపుల్ ప్రధాన అర్చకుడు రంగరాజన్‌పై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడారు. దాడి చేసిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు నర్సింలు, అరుణ్ తదితరులున్నారు.

కేటీఆర్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే



ఎల్లారెడ్డిరూరల్/లింగంపేట: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ , మాజీ మంత్రి కేటీఆర్‌ను మంగళవారం ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జనార్దన్‌గౌడ్ హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి బీఆర్‌ఎస్ పార్టీ బలోపేతంపై చర్చించినట్లు నేతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంపత్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ మనోహర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నేత సత్యంరావు తదితరులున్నారు.

విద్యార్థులు అన్నిరంగాలలో రాణించాలి


తాడ్వాయి ఉన్నత పాఠశాలలో వైజ్ఞానిక ప్రదర్శనను ప్రారంభిస్తున్న అధికారులు, నేతలు


ప్రదర్శనను తిలకిస్తున్న విద్యార్థులు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): విద్యార్థులు చదువుతో పాటు అన్నిరంగాలలో రాణించాలని మండల విద్యాశాఖాధికారి రామస్వామి అన్నారు. తాడ్వాయి ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం అబ్దుల్ కలామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యూత్ ఎక్సలెన్స్ సహకారంతో డీఆర్డీవో, ఇస్రోలలో తయారు చేసిన మిస్సైల్స్, శాటిలైట్స్, మంగళయాన్, ఆర్యభట్ట, బ్రహ్మోస్, చంద్రయాన్ నమూనాలను ప్రదర్శించారు. విద్యార్థులు అబ్దుల్‌కలాంను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. మండలంలోని వివిధ పాఠశాలలు, కళాశాలకు చెందిన విద్యార్థులు తరలి వచ్చి ఈ ప్రదర్శనను తిలకించారు. మాజీ వైస్ ఎంపీపీ నర్సింలు, మాజీ సర్పంచ్ సంజీవులున్నారు.

అస్తవ్యస్తంగా మురుగు కాలువలు


పోచారం తండాలో రోడ్లపై ఇలా.. మురుగు నీరు

నిజాంసాగర్(జుక్కల్): గిరిజన తండాలు, గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యం పడకేసింది. మురికి కాలువలు లేకపోవడంతో కాలనీల్లో సిమెంట్ రోడ్లపైనే మురుగు నీరు ప్రవహిస్తోంది. ప్రధాన రహదారులు మురికి నీటి ప్రవాహాలకు నిలయంగా మారుతున్నాయి. పెద్ద కొడప్‌గల్, జుక్కల్, బిచ్కుంద, పిట్లం, నిజాంసాగర్ మండలాల్లోని పలు గ్రామ పంచాయతీలతో పాటు తండాల్లో మురికి కాలువలు లేక మురికి నీరు రోడ్లపై ప్రవహిస్తున్నాయి. పెద్దకొడప్‌గల్ మండలం పోచారం తండా, కుబ్యా నాయక్, పెద్దదేవిసింగ్ గ్రామాలతో పాటు పలు గిరిజన తండాల్లో మురుగు నీరు రోడ్లపై పారుతుంది. మురుగు వాసనతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు ఇకనైనా స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

స్థానిక ఎన్నికల్లో బీఆర్‌ఎస్ జెండా ఎగరేయాలి


బాన్సువాడలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నేతలు

బాన్సువాడ : వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బాన్సువాడ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ జెండాను ఎగురేసి కేసీఆర్‌కు బహుమతిగా ఇవ్వాలని బీఆర్‌ఎస్ నాయకులు జుబేర్ అన్నారు. మంగళవారం తన నివాసంలో బీఆర్‌ఎస్ చిట్–చాట్ సమావేశం నిర్వహించి మాట్లాడారు. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ పుట్టిన రోజు వేడుకలను ఈ నెల 17న ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని అన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించాలని అన్నారు. నాయకులు మోచీ గణేష్, ఎర్రవాటి సాయిబాబా, శివకుమార్, నర్సింలుగౌడ్, తదితరులు ఉన్నారు.

‘యూపీఎస్‌పై యుద్ధభేరి’ వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ


ఎల్లారెడ్డిలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఉద్యోగ సంఘం నాయకులు


గర్గుల్ జెడ్పీహెచ్ఎస్‌లో..

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డిలో యూపీఎస్‌పై యుద్ధభేరికి సంబంధించిన వాల్‌పోస్టర్లను టీఎస్‌సీపీఎస్ఈయూ నాయకులు మంగళవారం ఆవిష్కరించారు. సీపీఎస్, యూపీఎస్ విధానం రద్దు చేసి ఓపీఎస్ విధానం అమలు చేయాలని కోరుతూ మార్చి 2న హైదరాబాద్‌లో మహాధర్నా కార్యక్రమం నిర్వహించనున్నట్లు యూనియన్ నాయకులు తెలిపారు. యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు షాకీర్, నాగరాజు, చరణ్ తదితరులు పాల్గొన్నారు

గర్గుల్ జెడ్పీహెచ్ఎస్‌లో..

కామారెడ్డి రూరల్: మార్చ్ 2న జరుగబోయే యూపీఎస్‌పై యుద్ధభేరికి సంబంధించిన వాల్‌పోస్టర్లను గర్గుల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టీఎస్‌సీపీఎస్ఈయూ రాష్ట్ర బాధ్యులు నర్సింహారెడ్డి, ఇతర ఉపాధ్యాయులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొత్తపెన్షన్ విధానం ఉద్యోగుల భవిష్యత్తుకు కొరివి లాంటిదని వ్యాఖ్యానించారు. ఉద్యోగి రిటైర్మెంట్ తర్వాత ఉండే భవిష్యత్తును హత్య చేసినట్లేనని, పాత పెన్షన్ విధానమే అసలైన బతుకుభరోసా అని అన్నారు.

అజీముషాన్ జల్సా వాల్‌పోస్టర్లు..


పిట్లంలో వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మజీద్ కమిటీ సభ్యులు

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని జామా మజీదులో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో మజీద్ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ యాదుల్లా, కమిటీ సభ్యులతో కలిసి అజీముషాన్ జల్సా వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ.. మండల కేంద్రంలోని భారత్ ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 25న సాయంత్రం 7 గంటలకు మహిళలకు కోసం ప్రత్యేకంగా జల్సా కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హజ్రత్ మౌలానా మొహమ్మద్ అమిరుల్లా ఖాన్ హాజరవుతారని, ఆయన ప్రసంగం కూడా ఉంటుందన్నారు. ముఫ్తీ జంషీద్, జామా మజీద్ కమిటీ వైస్ ప్రెసిడెంట్ రబ్బాని, సెక్రెటరీ అమేర్, అంజత్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం..

కనులపండువగా రేణుకా ఎల్లమ్మ కల్యాణం



భిక్కనూరు: మండల కేంద్రంలోని రేణుకా ఎల్లమ్మ ఆలయ 49వ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం గౌడ సంఘం ఆధ్వర్యంలో రేణుకాదేవి ఎల్లమ్మ కల్యాణం కనులపండువగా నిర్వహించారు. భక్తులు భారీగా హాజరయ్యారు. మహిళలు అమ్మవారికి ఒడి బియ్యం పోసి కట్నకానుకలను సమర్పించుకున్నారు. ఇప్పకాయల హన్మంత్–భాగ్యలక్ష్మీ దంపతుల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

అయ్యప్ప ఆలయ 11వ వార్షికోత్సవం



పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని ధర్మ శాస్త్ర అయ్యప్ప ఆలయం 11వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త వేణుగోపాల్, కుటుంబ సభ్యులతో కలిసి ఆలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.